## మాజీ మంత్రిని కలిసిన బీఆర్ఎస్ నేతలు



మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నవాబుపేట మండల నూతన కమిటీ సభ్యులు

నవాబుపేట, అక్టోబరు 14: మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డిని సోమవారం పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ నవాబుపేట మండల నూతన కమిటీ సభ్యులు కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సబితారెడ్డి కమిటీ సభ్యులను పరిచయం చేసుకొని రాజకీయ స్థితిగతులు, పార్టీ క్యాడర్ తదితర వివరాలు తెలుసుకొన్నారు. అనంతరం పార్టీ నూతన మండల అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్యకర్తలకు అండగా ఉండాలని మాజీ మంత్రిని కోరారు. మండల పరిధిలోని జరిగే పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకొంటానని, అందరికీ అండగా ఉంటానని ఆమె హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. మాజీ మంత్రిని కలిసిన వారిలో బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్, నవాబుపేట మండల గౌరవ అధ్యక్షుడు పట్లోళ్ల భరత్‌రెడ్డి, నూతన మండల అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు శాంతికుమార్, పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి మహేశ్‌రెడ్డి, కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి మాణిక్‌రెడ్డి, కోశాధికారి నరేందర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి శేఖర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజు, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు దశరథ్ ఉన్నారు.

## నూతన ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానించిన మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, అక్టోబర్ 14: ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పరిగి మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన రాజేందర్, రాజేశ్‌లను సోమవారం పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సన్మానించారు. రాజేందర్ ఏకంగా మూడు ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎస్.భాస్కర్, నారాయణపూర్‌కు చెందిన రాంచంద్రయ్య, హిదాయత్ పాల్గొన్నారు.

**మృతురాలి కుటుంబానికి పరామర్శ**

కులకచర్ల : మండల పరిధిలోని పీరంపల్లికి చెందిన నక్క ఈరమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి గ్రామానికి వెళ్లి ఈరమ్మ కుటుంబసభ్యులను పరామర్శించారు. వారిని ఓదార్చి మనోధైర్యాన్ని ఇచ్చారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో పరిగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్, హన్మంత్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్తబలిజ రాజు, మాజీ ఉపసర్పంచ్ మస్కట్ చెన్నయ్య, నక్క నర్సింహులు, బొల్ల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

**దోమలో..**

దోమ: మండల కేంద్రంలోని హరిజనవాడకు చెందిన బ్యాగరి పెంటయ్య వారం క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సోమవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ కోసం కృషి చేసే కార్యకర్తల కుటుంబానికి అండగా ఉండి ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ వెంకటయ్య, బ్యాగరి భీమయ్య, లాలయ్య, డప్పు శేఖర్, రమేశ్, బాలరాజు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఉపాధ్యాయులకు సన్మానం



నూతన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అంబేద్కర్ సంఘం తాలుకా అధ్యక్షుడు రమేశ్‌బాబు

కొడంగల్, అక్టోబర్ 14: ఇటీవల డీఎస్సీలో ఉద్యోగాలను పొందిన నూతన ఉపాధ్యాయులతో పాటు కుటుంబ సభ్యులను అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. సోమవారం మండల పరిధిలోని శ్రీనివాస్, భీమరాజు, సాయిలు, అరుణలను సత్కరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం తాలుకా అధ్యక్షుడు రమేశ్‌బాబు మాట్లాడుతూ.. పట్టుదల ఉంటే లక్ష్యాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జీవితంలో స్థిరపడినందుకు వారికి, ఉద్యోగ సాధనలో పూర్తి సహకారాన్ని అందించిన కుటుంబానికి ప్రత్యేకంగా అభినంధించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు మాజీ సర్పంచ్ రమేశ్ బాబు, వెంకటయ్య, జగన్మోహన్, దస్తప్ప, టేకల్‌కోడ్ మాజీ ఎంపీటీసీ రాములు తదితరులు పాల్గొన్నారు.

## మహవీర్ రోడ్డుకు మహర్దశ





ధారూరు, అక్టోబరు 14: జిల్లా కేంద్రం నుంచి ఎన్నేపల్లి నుంచి మహవీర్ దవాఖానకు వెళ్లే రోడ్డుకు మహర్దశ పట్టుకుంది. 15 ఏండ్ల నుంచి గుంతలమయంగా మారినా ఎవరూ పట్టించుకోలేదు. మహవీర్ దవాఖానకు వెళ్లే రోగులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వికారాబాద్ నుంచి ఎన్నేపల్లి నుంచి మహవీర్ దవాఖాన రోడ్డు మీదుగా మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి నేవీ రాడార్ స్టేషన్ నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి వెళ్లనున్నారు. దీంతో హుటాహుటిన ఈ రోడ్డుపై బీటీ వేయడంతో ప్రయాణికులు, రోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# కేజీబీవీ పూర్తయ్యేదెప్పుడో?

- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నూతన భవన నిర్మాణానికి రూ. 3.50 కోట్లు మంజూరు
- నత్తనడకన కొనసాగుతున్న పనులు
- పాఠశాలకు ప్రహరీ నిర్మాణం చేపట్టేనా..!
- రక్షణ ఉండదని తల్లిదండ్రుల ఆవేదన
- త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వానికి వేడుకోలు



కరీంపూర్ శివారులో నిర్మాణ దశలో ఉన్న కేజీబీవీ పాఠశాల

బంట్వారం (కోట్‌పల్లి), అక్టోబర్ 14: మండల కేంద్రంలో చేపట్టిన కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) పాఠశాల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మండలానికి నూతనంగా కేజీబీవీ పాఠశాల 2017లో ప్రారంభమైంది. ప్రస్తుతం 235 మంది విద్యార్థులతో కొనసాగుతున్నది. ప్రారంభంలో కొన్నాళ్లు అద్దె భవనంలో పాఠశాలను కొనసాగించారు. అక్కడ విద్యార్థులకు అసౌకర్యంగా ఉండడంతో తిరిగి స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొనసాగిస్తున్నారు. నాటి నుంచి అరకొర సౌకర్యాల మధ్య పాఠశాల కొనసాగుతున్నది. ఐదేండ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.3.50 కోట్లు నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. నిర్మాణ పనులు రెండేండ్లుగా కొనసాగుతూ.. ప్రస్తుతం చివరి దశకు చేరుకొన్నాయి. ఇందులో ఆరు తరగతి గదులు, రెండు ల్యాబొరేటరీలు, రెండు స్టడీ రూమ్‌లు, 8 ఇతర డార్మెటరీలతో పాటు ఇతర స్టాఫ్ రూమ్‌ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పూర్తిస్థాయిలో ఈ ఏడాది చివరి నాటికి భవనాన్ని పూర్తి చేస్తామని చెబుతున్నారు.

**రక్షణ కరువు**

పాఠశాల భవనం పూర్తి చేసినా.. తరగతి గదులు కొనసాగేంచేందుకు పలు సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. భవనం చుట్టూ ప్రహరీ లేదు. బహిరంగ ప్రదేశంలో నిర్మాణ చేపట్టారు. విద్యార్థుల సౌకర్యార్థం ఇక్కడ ఉండేందుకు అనువుగా ఉండదని వారి తల్లిదండ్రులు అభిప్రాయ పడుతున్నారు. అధికారులు చొరవ తీసుకొని ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే నీటి సరఫరా, డ్రైనేజీ నిర్మాణ పనులు ఇంకా చేపట్టలేదు. ఈ పనులు పూర్తి చేసేందుకు మరో ఆరు నెలలు పట్టే అవకాశం ఉంది. పనులన్నీ పూర్తయిన తర్వాత పాఠశాలకు విద్యార్థులను తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

**స్థలం లేక ఐదేండ్లు జాప్యం**



పాఠశాల మంజూరు కాగానే భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. భవన నిర్మాణానికి సరైన, స్థలం లేక ఐదేండ్లు నిర్మాణానికి నోచుకోలేదు. మండల కేంద్రంలో స్థలం లేకపోవడంతో కరీంపూర్ సమీపంలో సుమారు ఐదెకరాలు కేటాయించేలా అప్పటి కెమ్మెల్యే ఆనంద్ ప్రత్యేక చొరవ తీసుకొన్నారు. రెవెన్యూ అధికారులు స్థలాన్ని కేటాయించడంతో సమస్య తీరిపోయి, భవన నిర్మాణానికి అనుకూలంగా మారింది. అన్ని పనులు పూర్తి చేయించి వచ్చే విద్యా సంవత్సరంలో ఈ భవనంలో పాఠశాలను కొనసాగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. - సుందరి అనిల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు

## రైతులకు రుణమాఫీ అమలు చేయాలి

దౌల్తాబాద్, అక్టోబర్ 14: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని దౌల్తాబాద్ మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులందరికీ రుణమాఫీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని రోజుల క్రితం సీఎం ఆగస్టు 15 నాటికి పూర్తి చేస్తామని రైతులకు హామీ ఇచ్చినా చాలా మంది రైతులకు అమలుకు నోచుకోలేదన్నారు. బ్యాంకుల్లో తీసుకొన్న రూ.2లక్షల పంట రుణానికి సంబంధించి వెంటనే నిధులను విడుదల చేసి మాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు కొడంగల్ నియోజకవర్గంలో వేలాది మంది రైతులకు బ్యాంకుల్లో తీసుకున్న రుణం మాఫీ కాకపోవడంతో తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు డిసెంబర్ 9వరకు పూర్తి స్థాయి రుణమాఫీ చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా పెంచి ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ పెంపుదలపై ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా రుణమాఫీతో పాటు రైతులకు రైతు భరోసాను వెంటనే అమలు చేయాలన్నారు.

## అధికారులు నిబద్ధతతో పని చేయాలి



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

తాండూరు రూరల్, అక్టోబరు 14: విధుల నిర్వహణలో అధికారులు నిబద్ధతతో పని చేయాలని సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సూచించారు. సోమవారం తాండూరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులతో పాటు ధరణి క్యాబిన్‌ను పరిశీలించారు. ధరణిలో ఏర్పడుతున్న సమస్యలను తహసీల్దార్‌ను అడిగి తెలుసుకొన్నారు. రికార్డుల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధులకు ఎగనామం పెడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అధికారులు సమయపాలన పాటించి, రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ తారాసింగ్ ఉన్నారు.

## ప్రజావాణికి స్పందన కరువు





ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

కొడంగల్, అక్టోబర్ 14: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి స్పందన కరువైంది. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టి దరఖాస్తులను స్వీకరిస్తున్నది. ఇందులో భాగంగా కొడంగల్ మున్సిపల్ కార్యాలయంలో, ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు ప్రజావాణిని నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొని ఫిర్యాదుదారుల కోసం ఎదురు చూశారు. సమస్యలపై ఎవరూ దరఖాస్తు చేయలేదు. ఈ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించడం లేదా? ప్రజలు ఆసక్తి కనబర్చడం లేదా అని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

## క్రీడల్లో ఓటమి గెలుపునకు నాంది



విజేతగా నిలిచిన పెద్దేముల్ జట్టుకు రూ.21 వేల నగదును ట్రోఫీని అందజేసిన ప్రజాప్రతినిధులు, నాయకులు

పెద్దేముల్, అక్టోబర్ 14 : క్రీడల్లో ఓటమి గెలుపునకు నాందిగా నిలుస్తుందని పశుగణాభివృద్ధి సంస్థ జిల్లా మాజీ చైర్మన్ నారాయణ రెడ్డి అన్నారు. 10 రోజుల నుంచి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న చిట్టెపు ప్రకాశ్‌రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. టోర్నమెంట్ విజేతగా పెద్దేముల్ జట్టు నిలువగా రూ.21 వేల నగదుతో ట్రోఫీని,రన్నర్ జట్టుగా తట్టేపల్లి నిలువగా రూ.11 వేల నగదుతో ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకుడు రాఘవేందర్ రెడ్డి, నాయకులు జితేందర్ రెడ్డి, పెద్దేముల్ సొసైటీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, కోట్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నారాయణ రెడ్డి, జితేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, పెండ్యాల ప్రవీణ్ కుమార్ గుప్తా, మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరేశ్‌రెడ్డి, ఆజం ఖాన్, మహ్మద్ శిబ్లి, నరేందర్ రెడ్డి, విద్యాసాగర్, నర్సింహులు, దాసరి నర్సింహులు, రవికాంత్, బుజ్జమ్మ, ఎర్ర బాలప్ప, కిషన్‌రావు, ఇందూరు ప్రకాశ్, మధుసూదన్ రెడ్డి, బంగ్ల రఘు, ఆర్గనైజర్లు వెంకట్, మతీన్, తన్వీర్, అఖిల్, భానుచరణ్ తదితరులు పాల్గొన్నారు.

## అంతారంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు



బొడ్రాయి ప్రతిష్ఠాపనలో భాగంగా ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు

కులకచర్ల, అక్టోబర్ 14: మండల పరిధిలోని అంతారంలో సోమవారం బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 18 వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటి రోజు గ్రామంలో విగ్రహ అభిషేకం, జలాధివాసం తదితర పూజలు చేశారు. అనంతరం పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

## శివాలయ నిర్మాణం కోసం రూ.లక్ష విరాళం



బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సేరి రాంరెడ్డిని సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు

కులకచర్ల, అక్టోబర్ 14: కులకచర్లలో నిర్మిస్తున్న శివాలయ నిర్మాణానికి సోమవారం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సేరి రాంరెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణం కోసం తన వంతుగా విరాళం అందజేస్తున్నట్లు రాంరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు రాంరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పాత కక్షలతో గొడవ

ధారూరు, అక్టోబరు 14: పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని ఇరువురు వ్యక్తులు గొడవ పడ్డారు. వీరిలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ధారూరు పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని కుక్కింద గ్రామానికి జనగామ శ్రీనివాస్, బోయ పకీరప్పలు డబ్బుల విషయంలో గొడవపడ్డారు. పకీరప్ప.. శ్రీనివాస్‌ను కాళ్లతో తన్నుతూ.. పిడిగుద్దులు గుద్దడంతో పాటు పక్కనే ఉన్న కట్టెతో విచక్షణా రహితంగా కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స అనంతరం శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై వేణుగోపాల్ గౌడ్, విచారణ అనంతరం కేసు నమోదు చేసి పకీరప్పను మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచినట్టు తెలిపారు.

## మానవత్వం చాటుకున్న పదో తరగతి మిత్రులు



ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

కులకచర్ల, అక్టోబర్ 14: మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన ఎర్రం యాదగిరి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకొన్న 2007-08 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆర్థిక సాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. చిన్ననాటి మిత్రులు బతికి ఉన్నప్పుడే కాకుండా కుటుంబానికి దూరమైనప్పుడు తోడుగా ఉండాలని వారు కోరారు. మంచి మనసుతో ఆలోచించి వారి కుటుంబానికి రూ.16వేలు అందజేవారు. ఎల్లప్పుడు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మృతుడి కుటుంబసభ్యులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# దేవాలయాలపై వరుస దాడులు!

**ఈ నగరానికి ఏమైంది!**

- కొన్ని వర్గాల మధ్య విద్వేషాలు సృష్టించే యత్నం
- జాడలేని విజుబుల్ పోలీసింగ్
- పెట్రోలింగ్ వ్యవస్థ గాలికి

## భయాందోళనలో నగరవాసులు



సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయం వద్ద గుమిగూడిన భక్తులు

సిటీబ్యూరో: కొన్ని వర్గాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే వరుస ఘటనలు నగర ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఒక ఘటన జరిగితే మళ్లీ అలాంటివి పునరావృతం కాకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సి ఉన్నా.. ఆ దిశగా అడుగులు ఉండటం లేదన్న విమర్శలున్నాయి. సోమవారం సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలోకి దుండగుడు చొరబడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన కలకలం సృష్టించింది. హైదరాబాద్‌లో వర్గాల మధ్య చిన్న పాటి గొడవ జరగకుండా బీఆర్ఎస్ పదేండ్ల పాలన సాగింది. అదే స్ఫూర్తితో పని చేయాల్సిన పోలీసులు.. ప్రభుత్వం మారగానే అప్పుడు చేసిన సంస్కరణలు మేమెందుకు పాటించాలనే ధోరణితో హైదరాబాద్ పోలీసింగ్‌ను మార్చేశారన్న విమర్శలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనే నగరంలో కలహాలకు దారితీసే వరుస ఘటనలు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి.

**అప్రమత్తమవ్వని పోలీసులు..**

రెండు నెలల కిందట సంతోష్‌నగర్‌లో అమ్మవారి ఆలయం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు విధ్వంసానికి పాల్పడ్డారు. అలాగే ఇటీవల ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో దసరా నవరాత్రుల సందర్భంగా ఒక మండపం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు విధ్వంసకర చర్యలకు పాల్పడ్డారు. అయితే ఈ ఘటనపై అప్రమత్తమైన పోలీసులు నిందితుడిని గుర్తించారు. సదరు నిందితుడి మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడని పోలీసులు తేల్చారు. మరుసటి రోజు మాసబ్ ట్యాంక్ ప్రాంతంలో అలజడి సృష్టించే ఘటన జరిగింది. సీసీ కెమెరాల ఆధారంగా వెంటనే అసలు విషయాన్ని బయటపెట్టారు. మండపం వద్ద ఒక మాంసం ముక్క పడడానికి కుక్క కారణమనే విషయాన్ని వెల్లడించారు. అయితే ప్రశాంతంగా ఉండే సికింద్రాబాద్ ప్రాంతంలో ఎవరూ ఊహించనట్లుగా సోమవారం ఘటన చోటుచేసుకుంది. ముంబై నుంచి వచ్చిన వ్యక్తి ఇక్కడ ఆలయంలో విధ్వంసకర చర్యలకు పాల్పడటమే అనుమానాస్పదంగా ఉంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు హైదరాబాద్‌లో విధ్వంసకర చర్యలకు పాల్పడుతున్నారంటే పోలీసులు ఏం చేస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**విజుబుల్ పోలీసింగ్‌తో భయం..**

పోలీసుల పహారా ఉందనే భయం నేరస్తులకు లేకుండా పోయింది. అసలు విజుబుల్ పోలీసింగ్‌ను మొత్తానికే పక్కనే పెట్టేశారనే ఆరోపణలు వస్తున్నాయి. సీసీ కెమెరాలు కూడా చాలా చోట్ల పనిచేయడం లేదు. పెట్రోలింగ్ వ్యవస్థను గాలికొదిలేశారు. క్షేత్ర స్థాయిలో ఎవరేం చేస్తున్నారనే విషయాన్ని తెలుసుకునే వ్యవస్థను పక్కన పెట్టేయడంతో సిబ్బందిలో జవాబుదారీతనం కొరవడిందనే విమర్శలొస్తున్నాయి.